ఉచిత ఎంబ్రాయిడరీ శిక్షణను వినియోగించుకోవాలి

కళాశాల ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - ఆచంట
ఆచంట ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంప్రదాయ చేతి ఎంబ్రాయిడరీ కోర్సుకు 2 నెలల ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణ రాజు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ ఎంబ్రాయిడరీ కోర్సుకు ఆసక్తిగల యువతులు ఉచిత శిక్షణలో చేరి నైపుణ్యం పొందాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈనెల 31 లోపు కాలేజీకి వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు పొందవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు ఈక్రింది నెంబర్ 95735 28272, 63049 22617లను సంప్రదించాలని కోరారు.

బదిలీల్లో బాధలు..!

మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయుల పరిస్థితి దారుణం

మెడికల్ బోర్డులు అంగవైకల్యం తగ్గించి ఇచ్చిన సర్టిఫికెట్లతో గగ్గోలు

బదిలీల్లో మొదటి అవకాశం కోల్పోతున్న పరిస్థితి

డిఇఒ ఆదేశాలుంటేనే మరోసారి వైద్యపరీక్షలు అంటున్న సర్వజన ఆసుపత్రి అధికారులు

విద్యాశాఖ అధికారులను కలిసినా ప్రయోజనం శూన్యం

పాయింట్ల సీలింగ్‌పై డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ఉపాధ్యాయ బదిలీల్లో సమస్యలపై గురువులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ముఖ్యంగా మెడికల్ సమస్యలు ఉన్న ఉపాధ్యాయుల పరిస్థితి మరింత దారుణంగా మారినట్లు చెబుతున్నారు. మెడికల్ బోర్డులు అంగవైకల్యం శాతం తక్కువగా నమోదు చేస్తూ జారీ చేసిన సర్టిఫికెట్లతో బదిలీల్లో మొదటి అవకాశం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడినట్లు బాధిత ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు మంగళవారం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన ప్రధాన ఉపాధ్యాయులకు, ఎనిమిదేళ్ల దాటిన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వెరిఫికేషన్, సినియార్టీ జాబితా, అబ్జెక్షన్స్, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్, ఉద్యోగోన్నతుల ప్రక్రియ వంటివి ఈ నెల 31వ తేదీ వరకూ సాగనున్నాయి. ఏలూరు జిల్లాలో పదివేల మందికిపైగా ఉపాధ్యాయులు ఉండగా దాదాపు సగం మంది ఉపాధ్యాయులకు స్థానం చలనం ఉంటుందని తెలుస్తోంది. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయులకు అన్యాయం

విభిన్న ప్రతిభావంతుల కోటాలో ఉద్యోగాలు పొందిన వారు, వయస్సు ప్రభావంతో మెడికల్ సమస్యలు ఏర్పడినవారు, ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరైనా అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు బదిలీల్లో మొదటి అవకాశం కల్పిస్తారు. దీనికి మెడికల్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్ ఆధారంగా చేసుకుంటారు. ఉపాధ్యాయులకు ఏప్రిల్ 25, 26వ తేదీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి గతంలో ఉన్న సర్టిఫికెట్లు కాకుండా కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. గతంలో ఉన్న అంగవైకల్యం శాతానికి ఇప్పుడు మెడికల్ బోర్డులు ఇచ్చిన శాతానికి పొంతనే లేకుండాపోయింది. బహిరంగంగా అంగవైకల్యం కనిపిస్తున్నా తక్కువశాతం నమోదు చేసి ఇవ్వడంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు బదిలీల్లో తమకు వచ్చే అవకాశాన్ని కోల్పోతున్నట్లు చెబుతున్నారు. మెడికల్ శాతం తక్కువగా నమోదు చేయడంపై వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు మరోసారి మెడికల్ పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. బాధిత ఉపాధ్యాయులు పలువురు ఏలూరు సర్వజన ఆసుపత్రి అధికారులను కలవగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల పత్రం తెచ్చుకోవాలని తెలిపారు. దీంతో మెడికల్ సమస్యలున్న ఉపాధ్యాయులంతా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వీరిగోడును విద్యాశాఖ అధికారులు వినకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై బాధిత ఉపాధ్యాయులు తీవ్రంగా కలత చెందుతున్నారు. మెడికల్ సమస్యలతో ఎన్నో భాధలు పడి విద్యాశాఖ కార్యాలయానికి వస్తే కనీసం తమ మాట కూడా వినడంలేదంటూ బాధపడుతున్న పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల సమస్యలపై ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను వివరణకోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పాయింట్ల సీలింగ్‌పై డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు

గతంలో ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అన్ని పాయింట్లు ఏడాదికి మూడు చొప్పున కేటాయించేవారు. ఇప్పుడు పాయింట్లకు ఎనిమిది సంవత్సరాల సీలింగ్ పెట్టారు. అంతకు మించి సర్వీస్ ఉన్నా పాయింట్లు నమోదు లేకుండా చేశారు. దీంతో 2014 డిఎస్‌సి, 2016 స్పెషల్ డిఎస్‌సి, 2015లో బదిలీ అయిన టీచర్లకు నష్టం వాటిల్లుతుందని, జూనియర్, డిఎస్‌సి ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు.

నవ సమాజ నిర్మాణానికి యోగా దోహదం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం
యోగా ఆరోగ్యవంతమైన నవసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఆడిటోరియంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర-2025 పేరుతో రాష్ట్రవ్యాప్త ప్రారంభించిన యోగా ప్రచారంలో భాగంగా యోగా కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అందరితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, చిక్కాల అంబిక ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, అధికారులు, ఉద్యోగులు, కాస్మోపాలిటన్ క్లబ్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ప్రారంభం

హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం
భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన హెల్ప్‌డెస్క్‌ను ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడారు. బదిలీలు ప్రమోషన్ల కోసం జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, డైరెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే మిగిలిన ఉపాధ్యాయ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటుచేసి పోరాటానికి పిలుపునిచ్చి, చాలా వరకూ ఉపాధ్యాయులకు అనుకూలమైన నిర్ణయాలను సాధించామన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్ల విషయంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి వచ్చి ఉపాధ్యాయులు ఆన్‌లైన్ అప్లికేషన్స్ ఉచితంగా చేయించుకోవచ్చని, అనుమానాలుంటే నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కె.రామకృష్ణప్రసాద్, జి.రామకృష్ణంరాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అబ్రహం, నాయకులు పాల్గొన్నారు.

భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి సేవలు భేష్

అంగన్‌వాడీ చిన్నారులపై మరింత శ్రద్ధ చూపాలి - రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

భీమవరం : రోగులతో మాట్లాడుతున్న అజయ్‌జైన్

ప్రజాశక్తి - భీమవరం
భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి అందజేసిన సేవలు భేష్‌గా ఉన్నాయని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అభినందించారు. జిల్లా పర్యటనలో భాగంగా అజయ్ జైన్ బుధవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి, గునుపూడి ఇందిరా గాంధీ పురపాలక సంఘం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం, నాచువారి సెంటర్లో ప్రభుత్వ చౌక డిపో దుకాణాలను అజయ్ జైన్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా సందర్శించారు. ఒపిలో రిజిస్టర్లను పరిశీలించారు. రోజుకు ఎంతమంది పేషెంట్లు వస్తుంటారని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మేరకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఆసుపత్రికి సంబంధించిన నిధులు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎక్కడా ఎటువంటి లోటు లేకుండా రోగులకు సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం పనితీరును పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలన్నారు. చిన్నారుల హాజరుపట్టీని పరిశీలించారు. నాచువారి సెంటర్లోని 18వ ప్రభుత్వ చౌక డిపోను పరిశీలించారు. ప్రభుత్వం చౌక డిపోల ద్వారా అందించే సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు, జిల్లా గహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చియ్య, ఇఇ బి.వెంకట రమణ పాల్గొన్నారు.

పేద మహిళల్లో వెలుగు నింపిన దీపం పథకం

దీపం పథకం పేదింట మహిళల్లో వెలుగులు నింపిందని రాష్ట్ర పర్యాటకం, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. దుర్గాపురంలో దీపం పథకం లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పథకం ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పేద మహిళలకు ఆర్థిక ప్రయోజనం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందజేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. లబ్ధిదారుని గృహంలో స్వయంగా గ్యాస్ స్టవ్‌ను వెలిగించి టీ కాచి లబ్ధిదారునికి స్వయంగా అందజేశారు. కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ కాచిన టీ తాగి చాలా రుచికరంగా పెట్టారని అభినందించారు.

ఇంటి నిర్మాణం చేపట్టని స్థలాలను రద్దు చేస్తాం..


ఉండి : ఉత్పత్తులను పరిశీలిస్తున్న అజయ్ జైన్

ఉండి : గత ప్రభుత్వం హయాంలో స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో చాలా మంది కనీసం పునాదులు వేయలేదని, వాటిని క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి తక్షణం రద్దు చేయాలని రాష్ట్ర పర్యాటక గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం మండలంలోని మహదేవపట్నంలో గ్రామ సచివాలయాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, డంపింగ్ యార్డ్‌ను, ఎస్‌సి కాలనీలో ఇళ్ల స్థలాలను, ఎన్‌ఆర్‌పి అగ్రహారంలోని రైతు సేవా కేంద్రాన్ని అజయ్ జైన్ పరిశీలించి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామంలో ఎన్ని లేఅవుట్లలో ఎంతమంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేశారని, వాటిలో ఎంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని, ఇల్లు నిర్మించేందుకు వారికి అవగాహన కల్పించడంలో అధికారులు ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిశీలించి నిర్మాణం జరగని ఇంటి స్థలాలను రద్దు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ఎలా జరిగాయని ఏవైనా ఇబ్బందులు తలెత్తాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ధాన్యం డబ్బులు రావడంలేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు మేలైన లాభసాటి వరి వంగడాలను అందించడంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. మిల్లెట్‌ల సాగు, అంతర పంటల సాగుపై రైతులలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచి వణిమా నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : కాలనీలో నిర్మాణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం రాత్రి మండలంలోని తాళ్లకోడు జగనన్న కాలనీకి వచ్చారు. మొత్తం 16 నిమిషాలు ఇద్దరు నాయకులు చెప్పిన విషయాలు, మహిళ మహిళ చెప్పిన ఓ సమస్యను విని వెళ్లిపోయారు. సుమారు వెయ్యి కుటుంబాల నుంచి 1,400 మంది ఎక్కడ సమస్యలను నిత్యం ఎదుర్కొంటున్న ఏ ఒక్కరినీ కూడా కలవకుండా హడావుడీగా వెళ్లిపోచారు. స్థానికుల నుండి సమస్యలు తెలుసుకోవడానికి గాని ప్రత్యక్షంగా సమస్యలను చూడటానికి గాని సమయం కేటాయించకపోవడం గమనార్హం. ముందుగా డిసిసిబి మాజీ ఛైర్మన్, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) అక్కడ సమస్యలను ప్రస్తావించారు. అలాగే సిపిఎం నాయకులు బివి.వర్మ పలు సమస్యలను వివరించారు.

డిప్యూటీ కలెక్టర్‌తో సంప్రదించి నిర్ణయిస్తాం..

సమస్యలను విన్న అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు అజయ్‌జైన్ సమాధానం చెబుతూ ఇరువురి చెప్పింది విన్నామని డిప్యూటీ స్పీకర్‌తో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

24, 25 తేదీల్లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు

రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు

ప్రజాశక్తి - భీమవరం
నరసాపురంలో ఈ నెల 24, 25 తేదీల్లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ, మండల, పట్టణ కార్యదర్శులు, సభ్యులు, శాఖా కార్యదర్శులు 300 మంది ఈ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. పార్టీ రాష్ట్ర అఖిల భారత మహాసభల అనంతరం జరుగుతున్న ఈ సమావేశాల్లో దేశంలో, రాష్ట్రంలో తీసుకున్న రాజకీయ విధాన కర్తవ్యాలను వివరిస్తారని తెలిపారు. వీటితోపాటు ఆరు నెలలుగా జిల్లాలో నిర్వహిస్తున్న ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశాల జయప్రదానికి నర్సాపురం ఏరియా ప్రజానీకం సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు గ్రామాలను పట్టణంలో కలపొద్దు

మా ఉపాధిని దెబ్బతీయొద్దు

వ్యకాస ఆధ్వర్యాన ఉపాధి కూలీల నిరసన

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు గ్రామాలను పట్టణంలో కలపొద్దు, మా ఉపాధిని దెబ్బతియ్యొద్దు అంటూ ఉపాధి కూలీలు నినాదాలు ఇస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పనిప్రదేశాల పర్యటనలో భాగంగా బుధవారం కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం గ్రామాలను సందర్శించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ మా గ్రామాలను పట్టణంలో కలపడం వల్ల మూడు సంవత్సరాలు మాకు ఉపాధి పనులు లేకుండా పోయాయని, గత సంవత్సరం నుంచి మరలా పనులు పెడుతున్నారని, ఈ పనులను ఇలాగే కొనసాగించాలని పట్టణంలో కలపొద్దని వారు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీని పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరింపజేయాలని, మండలంలో నాలుగు గ్రామాలను పట్టణంలో విలీనం చేస్తూ ప్రకటించినప్పటి నుంచి మూడు సంవత్సరాల పాటు కూలీలకు ఉపాధి పనులు లేకుండా పోయాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఆ గ్రామాల ప్రజల కోరిక మేరకు ఆ గ్రామాలను గ్రామాలుగానే ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పప్పుల సీత, దంగేటి ఈశ్వరి, చవల మరియమ్మ, దంగేటి సత్యనారాయణ, నూనె పెద్దిరాజు, బసివిరెడ్డి వెంకట సత్యనారాయణ, దెయ్యం శ్రీను, పోలిశెట్టి నాగేశ్వరరావు, శీలంశెట్టి సూర్యారావు, బసిరెడ్డి అమ్మన్న పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకు రేషన్ సరుకులు అందించాలి

సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య

పాలకోడేరు : ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య

ప్రజాశక్తి - పాలకోడేరు
వచ్చేనెల నుంచి చౌకు డిపోల ద్వారా రేషన్ సరుకులు అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, అయితే ప్రజలు మాత్రం ఎండియు వాహనాల ద్వారా సరుకులు అందించాలని కోరుకుంటున్నారని, వారి అభిప్రాయం మేరకు రేషన్ సరుకులు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య అన్నారు. పెన్నాడ గ్రామంలో చౌకు డిపోల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ, ఎండియు వాహనాలు రద్దు వంటి అంశాలపై సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను తీసుకువచ్చారు. దూర ప్రాంతంలో ఉన్న రేషన్ డిపోల దగ్గరికి వెళ్లి సరుకులు తీసుకోవాలంటే అనేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరి మహిళలు వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని చెప్పారు. పాత పద్ధతి ప్రకారం ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పున: పరిశీలించాలని తెలిపారు. ప్రజలు కోరుకున్న విధంగా రేషన్ సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం : జులై 1 నుండి రేషన్ సరుకుల పంపిణీ వాహనాలను రద్దు చేసే ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈమేరకు సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రస్తుతం వాహనం ద్వారా సరుకులు అందించే ప్రక్రియ అలవాటుగా మారిందని, ఇప్పుడు ఒక్కసారిగా వాహనాలు రద్దుచేసి షాపుల వద్దకు వెళ్లి తీసుకోవాలని చెప్పడం సరైంది కాదన్నారు. ఒకటవ తేదీ నుంచి యధావిధిగా వాహనాల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌కు నగదు బదిలీ ప్రకటించి ప్రజలకు నష్టం కలిగించిందని, ప్రస్తుత రేషన్ ప్రక్రియ కూడా నగదు బదిలీ పేరుతో రానున్న రోజుల్లో ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్‌ను దూరం చేయడానికి ఈ నిర్ణయం అమలు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ వాహనాలను యధావిధిగా కొనసాగించే ప్రక్రియను చేపట్టాలని, సన్న బియ్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

కనీస మౌలిక సదుపాయాలు కల్పించండి

అజయ్ జైన్‌కు సిపిఎం ఆధ్వర్యాన వినతి

వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆకివీడు
కనీస మౌలిక సదుపాయాలు కల్పించి తాళ్లకోడు ప్రభుత్వ కాలనీ వాసులని ఆదుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో 3400 గృహ సముదాయాల కోసం ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే 1400 గృహాలు నిర్మాణం పూర్తికాగా, మరో వెయ్యి గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వినతిలో వివరించారు. వీరిలో ఏ ఒక్కరికి కూడా ఇక్కడ కనీస సదుపాయాలు కరువయ్యాయన్నారు. కాలనీలోని 14 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన రహదారులు మొత్తం మురికి గోతులుగా ఉన్నాయని, వాటిని సీసీ రోడ్లుగా మార్చాలని కోరారు. లబ్ధిదారులందరికీ మంచినీటి సౌకర్యం కల్పించేందుకు గాను మంచినీటి పైపులైన్ ఏర్పాటుచేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేయాలని కోరారు. లబ్ధిదారులందరినీ నగర పంచాయతీకి చెందిన వారిగా పరిగణించి ఆమేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. కాలనీ మధ్యలో ఉన్న స్మశాన వాటికను శివారుకు మార్చాలని, వీధిలైట్ల మరమ్మతులు, పారిశుధ్య సమస్య పరిష్కారం చేపట్టాలని కోరారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంకి అప్పారావు, పౌర సంఘ నాయకులు బివి.వర్మ, లోకల్ రవితేజ, శంకర్, కిసింజర్, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే మృతికి కారణం : బంధువుల ఆరోపణ

వైర్‌లో విద్యుత్ సరఫరా జరగడం లేదు : ఎఇ

ప్రజాశక్తి - ఉండి
మండలంలోని వెలివర్రు గరువులో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన బొజ్జా రవి(19) అన్న యువకుడు వెలివర్రు గరువు ప్రాంతంలో చేపలు పట్టేందుకు బోదెలో దిగగా కిందకు వేలాడదీసి ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని, అతడిని రక్షించేందుకు మరో యువకుడుతో పాటు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని తెలిపారు. ఈ సమాచారాన్ని వెనువెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసి సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలికి స్థానికులతో పాటు బాధిత కుటుంబ సభ్యులు చేరుకొని ప్రాణాలు కోల్పోయిన బొజ్జ రవి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన ప్రాంతంలో తెగిపడిన విద్యుత్ తీగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాసరావు, పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే రవి ప్రాణాలు కోల్పోయాడని అతని సన్నిహితులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ సహాయక ఇంజనీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బోదె వద్ద ఉన్న విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా జరగట్లేదని, వాటిలో విద్యుత్ సరఫరా జరుగుతుందో లేదో పరీక్షించడం జరిగిందని అన్నారు.

సమస్యలు ఆలకిస్తూ.. స్పందిస్తూ..

'మీకోసం మన రామానాయుడు'లో మంత్రి నిమ్మల

సమస్యలు వింటున్న మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు
మీకోసం మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా బుధవారం పాలకొల్లులో మంత్రి కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసారు. మంత్రికి తమ సమస్యలను తెలిపి వినతిపత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యను ఆలకించి సానుకూలంగా స్పందించారు. బదిలీల నిమిత్తం ఉద్యోగులు సిఫార్స్ కోసం ఎక్కువగా వచ్చారు. కొందరు మహిళలకు కూరగాయలను మంత్రి రామానాయుడు అందజేశారు.

నెగ్గిపూడి కల్వర్టు వద్ద ట్రాఫిక్ రద్దీ

ప్రయాణీకుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న ప్రయాణీకులు

నిర్మాణంలో ఉన్న మండలంలోని నెగ్గిపూడి(నెగ్గిపూడి) కల్వర్టు వద్ద వాహనాల రద్దీ వల్ల ట్రాఫిక్ జామై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈమార్గంలో గడచిన మూడు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వల్ల నరకం అనుభవిస్తున్నామని పలువురు విమర్శిస్తున్నారు. గడచిన రెండు రోజులుగా వర్షాలు కురుస్తూ కల్వర్టు వద్ద మార్గం బురదగా మారడం వల్ల కార్లు, ద్విచక్ర వాహనాలు దిగబడిపోయి గంటలకు గంటలు బయట పడ్డానికి ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇక్కడ పరిస్థితి పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణం లోని కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవనంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి తదనంతరం కెనాల్ రోడ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి ఐటీ రంగంలో పెద్ద ఎత్తున సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన మహా నాయకుడు రాజీవ్ గాంధీ అని శివాజీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి అర్జునరావు, బోనం వెంకట్రావు, ముడకల గోపాలరావు, కె.ప్రభుదాస్ పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

సెల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన రూ.1.50 లక్షల విలువైన సెల్‌ఫోన్లను తాడేపల్లిగూడెం జిఆర్‌పి పోలీసులు రికవరీ చేసినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పిఎస్ఐ ఇ.అప్పారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు సదరు ఫిర్యాదుదారులకు వారి మొబైల్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిఆర్‌పి ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ రైల్లో ప్రయాణించేప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రిళ్ళ ప్రయాణించేప్పుడు కిటికీ తలుపులు వేసుకోవాలని ప్రయాణికులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

బస్‌స్టాండ్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు బస్టాండ్ పారిశుద్ధ్య పరిస్థితి నిర్వహణ తీరు తెన్నులను స్థానిక తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బస్టాండ్ నిర్వహణ పరిస్థితి ఎలా ఉంది అనే అంశాలని పరిశీలించి, రిపోర్ట్ పంపించినట్లు ఆయన తెలిపారు.

జగన్‌ను కలిసిన వైట్ల

ప్రజాశక్తి - ఆచంట

వైసిపికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేస్తామని వైసిపి ఆచంట నియోజకవర్గ నాయకులు వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డిని బుధవారం ఆచంట నియోజకవర్గ నాయకులు వైట్ల కిషోర్‌కుమార్, మనవర్తి విజయ్ కుమార్, మడిమెట్ల నరేష్ తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, శాలువాతో జగన్మోహన్ రెడ్డిని సత్కరించారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టిలో పెట్టి పరిష్కార దిశగా అహర్నిశలు కృషిచేస్తానని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ, రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జనసేన క్యాంప్ కార్యాలయంలో పెంటపాడు మండలంలోని పలు గ్రామాల వైసిపి నాయకులు జనసేనలో చేరారు. పెంటపాడు మండలం రామచంద్రపురం గ్రామం నుండి బుడత జంగాల కులం నాయకులు, 50 మంది యువ నాయకులు, ఆకుతీగ పాడు గ్రామం నుండి పంచాయితీ సర్పంచ్ దాసం వెంకటేశ్వరరావుతో పాటు ఆకుతీగ పాడు గ్రామం నుండి 10 మంది ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చేతులమీదుగా పుల్ల బాబి ఆధ్వర్యంలో జనసేన పార్టీ తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను గౌరవిస్తూ పార్టీలో చేరుతున్న ప్రతి కార్యకర్తలు జనసేన సిద్ధాంతాలకు లోబడి పనిచేయాలని, తద్వారా ప్రజలకు మేలు చేకూర్చాలని ఆయన అన్నారు. ఆదేవిధంగా బుడత జంగాలను ఎస్‌సి, ఎస్‌టిలో పొందుపరచాలని డిమాండ్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి, జాతీయ అమలుకు తన సాయి శక్తుల ప్రయత్నిస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుల్ల బాబి, పైబోయిన వెంకటరామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, మట్ల రామకృష్ణ, ఘంట్రు గణేష్, అడబాల మురళి, కోట శ్రీరామ్ పాల్గొన్నారు.

నేడు తిరంగా యాత్ర

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 22 గురువారం ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ, సహాపక్షుల చైర్మన్ పితాని సత్యనారాయణ సారథ్యంలో తిరంగ యాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస రెడ్డి(బుజ్జి) బుధవారం ఇక్కడ తెలిపారు. మండలంలోని నత్తా రామేశ్వరం సెంటర్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 6 గంటలకు మండలంలోని కోడేరు వరకు సాగి, అక్కడ ఈ యాత్ర ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల జోరు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

11 నెలల కూటమి ప్రభుత్వం మంచి పాలనలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు జోరందుకున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో నిర్వహిస్తున్న మినీ మహానాడు సందర్భంగా బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. పెన్షన్ సొమ్ము పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, డిఎస్‌సి నోటిఫికేషన్, మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, మత్స్యకారులకు వేట నిషేధ సమయం పరిహారం నుండి 20 వేలకు పెంపు వంటివి అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ఇరవై వేలకు పెంపు, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం కింద రూ.15 వేలు, మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నామని తెలిపారు. ఫేక్ బటన్, ఫేక్ సంక్షేమంతో జగన్ ఫేక్ సిఎంగా నిలిచిపోయాడని చెప్పారు. టిడ్కో గృహాలకు సంబంధించి 20 సంవత్సరాల పాటు బ్యాంకు రుణం కట్టుకుంటూ పోవాలంటూ దీర్ఘం తీస్తూ చెప్పి, గృహాలను బ్యాంకులో తాకట్టు పెట్టి ఐదు వేల కోట్ల సొమ్మును దారి మళ్లించి మోసం, దగా చేశాడని విమర్శించారు.

నరసాపురం: కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు వచ్చినా.. నాకు సంతృప్తి ఇవ్వడం లేదు. రానున్న ఎన్నికల్లో వైసిపిని భూస్థాపితం చేయాలన్నదే నా తపన. ఇందుకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కష్టించి పనిచేసి రాష్ట్రంలో వైసిపి లేకుండా చేయాలని ఎంఎల్‌సి పి.అనురాధ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 25వ వార్డు వీవర్స్ కాలనీలో నిర్వహించిన మినీ మహానాడుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుతగా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఎంఎల్‌సి రాజశేఖర్, మైనార్టీ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. తీర ప్రాంతంలో నెలకొన్న ఫిషింగ్ ఆర్బర్, కాళీపట్నం భూములు, ఆక్వా జోన్, కాపులకు ఐదుశాతం రిజర్వేషన్, బిసిలకు రాజకీయంగా గుర్తింపు, నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం వంటి ఐదు తీర్మానాలను రామరాజు ప్రతిపాదించగా వాటిని వాలాడే ఉమా, గుబ్బల నాగరాజు, జోగిపండు, జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్లు బలపర్చారు. అనంతరం కొప్పాడ రవి అధ్యక్షత నిర్వహించిన సభలో అనురాధ మాట్లాడారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో దాడులు, అత్యాచారాలు, నేరాలు, ఆడపిల్లలకు రక్షణ, తప్పుడు కేసులు తప్ప రాష్ట్రాభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, మావూరి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పంట కాలువల్లో పూడికతీతకు చర్యలు

ఇరిగేషన్ డిఇ పిఎన్‌వివి.సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి సబ్ డివిజన్ పరిధిలో కొత్తగా ఏడు కాలువల పూడికతీత పనులు, గత ప్రభుత్వంలో మంజూరైన రెండు పనులు చేపడుతున్నామని ఉండి ఇరిగేషన్ శాఖ డిఇ పిఎన్‌వివిఎస్.మూర్తి తెలిపారు. ఈనేపథ్యంలో ఉండి ఇరిగేషన్ శాఖ డిఇ సత్యనారాయణమూర్తితో ప్రజాశక్తి చిట్-చాట్ నిర్వహించింది. కాలువలకు సాగునీరు విడుదల చేయకముందే పంట, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టే లా చర్యలు తీసుకుంటామన్నారు. పలు అంశాలపై ఆయన వివరించారు.

చిట్ - చాట్

ప్రశ్న : పంట కాలువల్లో పూడిక తీత పనులకు నిధులు కేటాయింపులు ఉన్నాయా?

డిఇ : ఉండి సబ్ డివిజన్లో మొత్తం 9 పనులు మంజూరు. ఉండి ఇరిగేషన్ సబ్ డివిజన్లో మొత్తం 9 పూడిక తీత పనులు ఈ వేసవిలో ప్రారంభిస్తున్నారు.

ప్రశ్న : ఏవి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు?

డిఇ : కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.34 లక్షలతో ఏడు పనులు, గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన రెండు పనులు రూ.12.16 లక్షల అంచనాలతో పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిలో మొదటిగా ఉండి మండలం కలిసిపూడి రెగ్యులేటర్ నుంచి శివారు ప్రాంతం అజ్జమూరు సరిహద్దు వరకు రూ.33 లక్షల అంచనాలు కాగా అగ్రిమెంట్ రూ.22 లక్షలు వీటిలో లష్కర్ జీతాలు కూడా ఉంటాయి.

ప్రశ్న : మంజూరైన నిధులతో ఏవి పనులు చేపట్టాల్సి ఉంది?

డిఇ : వాండ్రం కాలువ రూ.7.06 లక్షల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. మిగిలినవి యండగండి సెక్షన్లో లోసరి మెయిన్ కాలువ, బాపనకోడు, యండగండి అప్పర్‌వేర్లల్ కాలువ, చిలకంపాడు సెక్షన్లో రావిపాడు కాలువ, వియండబ్ల్యూ కాలువ, పరిమెళ్ల లాకుల వద్ద లీడింగ్ కాలువ పూడికతీత పనులు, రూ.62 లక్షలతో చేపట్టాల్సిన ఐదు పనులు రెండు లేదా మూడు రోజుల్లో ప్రారంభిస్తారు. అలాగే గత ప్రభుత్వంలో రూ.12.16 లక్షల అంచనాలతో మంజూరైన అర్తమూరు, పాములపర్రు కాలువ, జక్కరం, బొర్రకోడుల పనులు చేపట్టాల్సి ఉంది. కలిసిపూడి, వాండ్రం కెనాల్ పూడికతీత పనులు పారదర్శకంగా జరుతున్నాయి. అనుకున్న విధంగానే పనులు చేపట్టి పూర్తిచేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో నీరు ఉండడం వల్ల రెండు లేదా మూడు రోజుల్లో మిగిలిన పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న : ఈ పనులు సాగునీరు విడుదల చేసే లోపు పూర్తి చేయగలరా?

డిఇ : పూడికతీత పనులు కాలువలకు సాగునీరు విడుదలచేసే లోగా పూర్తిచేస్తాం. రూ.10 లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ద్వారా చేయిస్తాం. ఆపైన విలువైన వాటిని స్వాట్ టెండర్లు పిలిచి చేపడతాం.

ప్రశ్న : కాలువల ఆక్రమణలు, కాలుష్యం నివారణకు చర్యలు?

డిఇ : కాలువలను ప్రక్షాళన చేయాలి. వీటిల్లో మురికినీటి తూరలను తొలగించేందుకు గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలు తొలగించేందుకు అందరి సహకారం ఎంతో అవసరం.

ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు పేద కుటుంబానికి ఆర్థికసాయం చేయడానికి ముందుకొచ్చారు. కాళ్లకూరు గ్రామం కొత్త కాలనీకి చెందిన మాదాసి లక్ష్మయ్య భార్య శాంతమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందింది. మట్టి ఖర్చుల నిమిత్తం ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు బుధవారం అందజేశారు.


విద్యార్థులను సత్కరిస్తున్న డివైఇఒ మురళీకృష్ణ

కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు : డివైఇఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తారని నిరూపించిన అందరికి అభినందనలని విద్యాశాఖ డివైఇఒ మురళీ సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వెలగలేరు(మార్టేరు) శుభమస్తు మండపం వేదిక మీద జరిగిన నరసాపురం డివిజన్‌లో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థుల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉచితంగా విద్య, ఉత్తమ బోధన, మంచి మౌలిక వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో అందరూ తమ పిల్లలను చేర్చడం వల్ల మెరుగైన ఫలిఫలితాలు సాధించవచ్చని ఈ ఫలితాలు నిరూపించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డివిజన్‌లో టెన్త్‌లో 500 నుంచి 550కి మించి మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి మార్కుల సాధనలో కృషిచేసిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, యు.నాగేశ్వరరావు, పోడూరు ఎంఇఒలు విజయ్ కుమార్, సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీధర నరసింహం, పులఖండం శ్రీనివాస్, ధర్మవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

25వ వార్డులో డ్రెయినేజీ పూడికతీత

పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 25వ వార్డులో డ్రెయినేజీ పూడికతీత పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా చేయడానికి డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. మురుగునీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, తద్వారా ప్రజలు అంటురోగాల భారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీలలో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. చెత్త వేయడం వల్ల డ్రెయినేజీ పూడుకుపోయి మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుందని, తద్వారా రోగాలు వస్తాయన్నారు. మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, యర్రా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర

పాలకొల్లు : భారతీయత అంటే విభిన్న సంస్కృతుల సమ్మేళనమని జాతి, మత, కుల బేధం లేకుండా ఉండే స్వభావమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంకు చెందిన తిరంగ యాత్ర బుధవారం సాయంత్రం పాలకొల్లు పట్టణంలో భారీగా నిర్వహించారు. 200 అడుగుల జాతీయ జెండాతో పట్టణ ప్రధాన వీధి గుండా ర్యాలీ నిర్వహించారు. కూటమికి చెందిన పలువురు నేతలు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి నేతలు రోజారమణి, ఉన్నమట్ల కబర్ధి, జీవి, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ తరగతులు కొనసాగినట్లు గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు మూడంచెల గ్రామీణ పరిపాలన గురించి వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి వీరాస్వామి, కొప్పెల్ల శ్రీనివాసరావు, ఎ.జనార్దన్ రావు విద్యార్థులకు నీతి కథలు, పుస్తకాలు చదివించి ఆటలు ఆడించారు. ఇంగ్లీష్ గ్రామర్, లెక్కల్లో సులువైన మెలకువలను విద్యార్థులకు నేర్పించారు. పట్టణంలో ఉన్న విద్యార్థులు గ్రంథాలయానికి విచ్చేసి ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి కోరారు.

గణపవరంలో..

నరసాపురం : ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించబడుచున్న వేసవి విజ్ఞాన తరగతులలో బుధవారం పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రాఫ్ట్ టీచర్స్ ఎన్.శాంతి కుమారి, బి.లక్ష్మి బాయి రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని పిల్లలకు రంగు కాగితాలతో పక్షులు, ఫిష్, బటర్ ఫ్లై, ప్యారెట్ మొదలైనవి తయారు చేయటంలో శిక్షణ ఇచ్చారు. బార్క్ శాస్త్రవేత్త సుబ్బారావు స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌లోని పది సూత్రాలు, విజన్ డాక్యుమెంట్ ఆవశ్యకత, ఆచరణకి ప్రణాళికల గురించి వివరించారు. స్కూల్ అసిస్టెంట్ సిహెచ్.శ్రీనివాస్ చిత్రలేఖనంలో శిక్షణ, భట్టిప్రోలు సత్యనారాయణ హిందీ క్లాసులు, పుస్తక పఠనం, చదవడం నాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్‌ఎల్.కుమారి పర్యవేక్షించారు.

గణపవరం : గణపవరం లైబ్రేరీలో కొనసాగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతికథలు చెప్పటం, కార్యంబోర్డు, చెస్ వంటి ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.సుభాషిణి, గుమ్మడి సుబ్బారావు పాల్గొన్నారు.

సైనిక సహాయనిధికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌డిఒకు 10 వేలు అందజేస్తున్న ఉపాధి కూలీలు

యర్రంశెట్టివారి పాలెం గ్రామ పంచాయితీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలు 150 మంది ఆపరేషన్ సిందూర్‌కు అండగా నిలిచారు. గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ బాబులు ఆధ్వర్యంలో బుధవారం నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజుకు తమ వంతు సాయంగా రూ.10 వేల రూపాయలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైనిక సహాయనిధికి రెవెన్యూ డివిజన్ అధికారికి చెక్కు రూపేనా అందజేశారు. ఈ సందర్భంగా నాగ ముత్యమాంబ బాబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ చట్టం కూలీలు కష్టపడిన కష్టంలో కొంత భాగం కేంద్ర ప్రభుత్వానికి తిరిగి ఇవ్వడం ఎంతో అభినందనీయమని కూలీలను అభినందించారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుని నాగముత్యమాంబ బాబులు శాలువా కప్పి పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు, తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగా మాసోత్సవం అభినందనీయం

ఎస్‌విజిహెచ్ హైస్కూల్ హెచ్‌ఎం సూర్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

నా దేశం నా ఆరోగ్యం నినాదంతో యోగా మాసోత్సవాన్ని మానవత సంస్థ పెనుమంట్ర శాఖ నిర్వహించడం అభినందనీయమని మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చిర్ల చిన్నఅన్నారు. బుధవారం హైస్కూల్ ప్రాంగణంలో యోగా మాసోత్సవ కార్యక్రమ ప్రారంభ సభకు అయన అధ్యక్షత వహించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్థానిక ఎస్‌విజి హై స్కూల్‌లో యోగ మాసోత్సవాన్ని ప్రారభించినట్టు మానవత సంస్థ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ యోగాని తమ దైనందిన జీవనంలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ధృఢత్వం పొందగలరని అన్నారు. అనంతరం యోగా ట్రైనర్ ఊహ ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మానవత ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, అమృతవాక్కుల సత్యనారాయణ, ప్రముఖ క్రీడాకారుడు వెలగల సత్తిరెడ్డి, కుంగ్ ఫు మాస్టర్ పవన్‌కుమార్, కరాటే మాస్టర్ అయ్యప్ప రెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్లా శ్రీనివాస రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు : యోగ, ప్రకృతి మానవుడికి ప్రసాదించిన వరమని, ఆరోగ్య సంరక్షణకు యోగ మానవుడికి ప్రధాన సాధనమని వక్తలు వివరించారు. జూన్ 21వ తేదీ యోగ డే సందర్భంగా రాష్ట్రంలో ఈనెల 21వ తేదీ నుంచి 30 రోజుల పాటు నిర్వహించనున్న యోగ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎండిఒ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి యోగా ఆశ్రమ, పతంజలి యోగా ప్రచార సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బి.బలరాం ప్రతాప్‌కుమార్, యోగసనాచార్యులు, ధ్యాన ప్రచారకులు డాక్టర్ యు.సాంబశివరావు, యోగాచర్య మోటుపల్లి సత్యరాజులు పాల్గొన్నారు. ధ్యానం యోగ అంశాలు, వాటి వల్ల ఉపయోగాలను వారు వివరించారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రజా రవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డెలివరీ, విద్యార్థులకు రాయితీలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు, సలహాలు, సూచనలు, సిబ్బంది ప్రవర్తన, ప్రత్యేక బస్సుల ఫిర్యాదులుంటే 9959225486 నెంబర్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ కళాశాల అభివృద్ధికి కృషి

నరసాపురం : పద్మశ్రీ అద్దేపల్లి సర్వేచెట్టి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన స్థాపించిన విద్యాసంస్థల అభివృద్ధికి అంకితభావంతో కృషిచేస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈమేరకు బుధవారం స్థానిక ఉమెన్స్ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఎన్.రమణమూర్తి, తుమ్మలపల్లి వీరభద్రం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొంతమంది ఉద్దేశపూర్వకంగా కళాశాల పాలకవర్గంపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. వారి ఆరోపణలలో ఏమాత్రం నిజం లేదన్నారు. తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టే నాటి నుండి ఇప్పటివరకు విద్యాసంస్థల అభివృద్ధికి లక్షలాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. కళాశాలకు రాయపేటలో దాతలు ఇచ్చిన 1200 గజాల స్థలంలో 600 గజాల స్థలాన్ని విక్రయించామన్నారు. ఆ నిధులతో సుమారు రూ.20 లక్షల మున్సిపల్ పన్నులు చెల్లించామన్నారు. మిగిలిన నిధులను బ్యాంకులో జమచేశామని వారు తెలిపారు. గత ఏడాది నరసాపురానికి చెందిన కొల్లి నాయకర్ కళాశాలలో పలు

కళాశాల యాజమాన్యం

మాట్లాడుతున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

అవకతవకలు జరిగాయని, విచారణ జరపాలని ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా అధికార యంత్రాంగం తమ కళాశాలకు విచ్చేసి విచారణ జరిపిందన్నారు. ఎటువంటి లోపాలు ఆ విచారణలో బయటపడలేదన్నారు. కళాశాల నిధులను తనకు వడ్డీకి ఇవ్వాలని పట్టణానికి చెందిన ఒక ప్రముఖ కాంట్రాక్టర్ తనపై ఒత్తిడి తెచ్చారని ఆ ఒత్తిడికి తాను లొంగలేదన్నారు. దీంతో మనసులో కక్ష పెంచుకుని తమ పాలకవర్గాన్ని నన్ను అల్లరిపాలు చేసేందుకే ఇటువంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. వైసిపి నేత కావలి నాని ఒక సందర్భంలో తనతో మాట్లాడుతూ ఈ విద్యాసంస్థలు కౌన్సిలర్ అయిన తన భార్య రామసీత పరిధిలో ఉన్నాయని, కళాశాలలో జరిగే జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలకు పిలవాలని ఒత్తిడి తెచ్చారన్నారు. నిబంధనల ప్రకారం ఆవిధంగా చేయడం కుదరదని చెప్పానన్నారు. ఈ విషయం నచ్చని నాని ఉద్దేశపూర్వకంగా తమ పాలకవర్గంపై బురదజల్లేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వానికి, అధికారులకు కూడా ఫిర్యాదు చేశారన్నారు. తాము ఏమి చేసినా అభివృద్ధి కోసమే గాని తమకు వ్యక్తిగత అజెండా లేదన్నారు. కావాలని కొంతమంది తమను రాజీనామా చేయాలని కోరుతున్నారని, అటువంటి డిమాండ్లకు ప్రాముఖ్యత లేదన్నారు. తమ పాలకవర్గంపై చేసిన ఏ ఆరోపణలకు, విమర్శలకు తాము ఏవిచారణకైనా సిద్ధంగానే ఉన్నామన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.నీరజ ఉన్నారు.

నేడు ఎల్ఎన్ పురం ఉపసర్పంచి ఎన్నిక

ప్రజాశక్తి - కాళ్ల

ఎల్ఎన్ పురం గ్రామ ఉపసర్పంచి ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.స్వాతి బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి సమక్షంలో జిల్లా పంచాయతీ అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఉపసర్పంచిపై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ఈ ఎన్నిక అనివార్యం అయింది.

అజయ్ జైన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భీమవరం బివి.రాజు అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ కు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. అజయ్ జైన్‌కు స్వాగతం పలికిన వారిలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బివి.రాజు విద్యాసంస్థల ప్రతినిధులు ఉన్నారు.

కోపల్లెలో ప్రత్యేక కార్యదర్శి బస

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర పర్యాటక, గనుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ కోపల్లె గ్రామంలో బుధవారం రాత్రి నిద్ర చేయనున్నట్లు కాళ్ల ఎంపిడిఒ జి.స్వాతి తెలిపారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పర్యటన అనంతరం కోపల్లెలో నిద్ర చేస్తారని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నామని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి అందే సూర్యావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

జనసేన సభ్యత్వంతో ప్రమాద బీమా

ఆచంట : జనసేన సభ్యత్వం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రెటరీ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వల్లూరు గ్రామంలో జనసేన సభ్యత్వ నమోదు కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారి ఒక రాజకీయ పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన వారికి రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. సభ్యత్వాల ద్వారా సైనికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి అండగా నిలుస్తున్న డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No:139/2025 In O.S.No: 62 of 2025

Between:
పిటిషనర్/వాది: బొబ్బిలి శివ గంగా విష్ణు కుమార్
And
రెస్పాండెంట్/ప్రతివాది:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ
రెస్పాండెంట్/ప్రతివాది అడ్రసు:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ,
W/o.విజయ్, వయస్సు: 46 సం.లు,
R/o H.No.1-84, (Old H.No.1-137),
లక్ష్మి నారాయణ నిలయం, శ్రీనగర్ కాలనీ,
రాయలం, భీమవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్,
భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534202.

పై నంబరు పిటిషన్‌కు సంబంధించి రెస్పాండెంట్/ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన పై పిటిషన్ నోటీసులు, సెక్యూరిటీ నోటీసులు, అటాచ్మెంట్ నోటీసులు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నారు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసులు ఇవ్వడమైనది. కావున సదరు రెస్పాండెంట్/ప్రతివాది ది.**16-06-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు రెస్పాండెంట్/ప్రతివాది పరోక్షమందు (Ex- Parte గా) పై పిటిషన్ తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
Place : భీమవరం, న్యాయవాది, భీమవరం
Date: 22-05-2025 Ph:9781123789.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No: 62 of 2025

Between:
వాది: బొబ్బిలి శివ గంగా విష్ణు కుమార్
And
ప్రతివాది: కాళ్ళకూరి విజయ కనకదుర్గ
ప్రతివాది అడ్రసు:
కాళ్ళకూరి విజయ కనకదుర్గ, W/o.విజయ్, వయస్సు: 46 సం.లు, R/o H. No. 1-84, (Old H.No.1-137), లక్ష్మి నారాయణ నిలయం, శ్రీ నగర్ కాలనీ, రాయలం, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం సివిల్ కోర్ట్స్, పిన్ కోడ్:534202.

పై నంబరు దావాకు సంబంధించి ప్రతివాది అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారా నేరుగా అలాగే రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన దావా సమన్లు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచూ కాలయాపన చేస్తున్నారు. కావున పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్లు ఇవ్వడమైనది. కావున సదరు ప్రతివాది **ది.16-06-2025** సంవత్సరం తేదీన ఉదయం గం.10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను, లేనియెడల సదరు ప్రతివాది పరోక్షమందు (Ex- Parte గా) పై దావా తీర్మానించబడును.

సొరపల్లి సత్య నరేష్ కుమార్,
Place : భీమవరం, న్యాయవాది, భీమవరం
Date: 22-05-2025 Ph:9781123789.